18వ రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:ఏకలవ్య పాఠశాలకు భూములిచ్చిన భూ దాతలకు ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ బాధిత గిరిజనులు చేపడుతున్న రిలే దీక్షలు సోమవారం 18వ రోజుకు చేరుకున్నాయి. తక్షణమే తమకు న్యాయం చేయాలని భూ దాతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న బాధితులు

మన్యం బంద్ జయప్రదానికి ప్రచార హోరు

- అయ్యన్న వ్యాఖ్యలపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి
- ఆదివాసీ చట్టాల జోలికొస్తే ఊరుకోం - పలుచోట్ల బైక్ ర్యాలీలు

అనంతగిరిలో బైక్ ర్యాలీ చేపడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్:గిరిజన ప్రాంతం లో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు 1/70 చట్టం ఆటంకంగా ఉందని, గిరిజన చట్టాలను సడలించాలని స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలపై ఈనెల 11,12 తేదీలలో తలపెట్టిన మన్యం బంద్ విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం అరకులోయలోని డిగ్రీ కళాశాల నుండి అరకు వరకు ఆదివాసి అఖిలపక్ష ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి 1/70 చట్టం పై తమ వైఖరి ఏంటో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పర్యాటక ప్రదేశాలు బొర్రా అరకు, లంబసింగ్ వచ్చే పర్యాటకులు ఈ రెండు రోజులు చేపడుతున్న బందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, పెదలబుడు ఎంపీటీసీ దురియా ఆనంద్, డిఎల్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర ప్రసన్నకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాచిపెంట చిన్నస్వామి, ఆదివాసి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు చట్టు మోహన్, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు, సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, ఆదివాసి గిరిజన సంఘం నేతలు పి రామన్న, కె బుజ్జిబాబు, కొర్ర మగ్గన్న, కిల్లో జగన్నాథం, కిల్లో సహదేవ్, పి.నానిబాబు, గురుమూర్తి ఎస్ఎఫ్ఐ నాయకులు ఐసుబాబు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:1/70 చట్టం సవరణ చేయాలని స్పీకర్ చింతకాయల ఆయన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం వైఖరి స్పష్టం చేయాలని అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. అనంతగిరి మండలం బొర్ర గృహాల నుండి డముకు జంక్షన్ వరకు బైక్ ర్యాలీతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అనంతగిరి జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, 1/70 చట్టం జోలికొస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, సిపిఎం మండల నాయకుడు సోమెల నాగులు, వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, గెమ్మెల దేవన్న, వంతల బుద్రయ్య, గెమ్మెల భీమరాజు, కిల్లో స్వామి పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో నేడు, రేపు నిర్వహించే 48 గంటల బంద్‌తో కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని ఆదివాసి గిరిజన సంఘం నేతలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలతో పాటు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ వాహనదారులు సహకరించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను, కార్యదర్శి నరసయ్య, జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కొర్ర త్రినాథ్, గాసిరాం దొర, లైకొన్, పాల్గొన్నారు.

రాజ ఒమ్మంగిలో సమావేశం

పెదబయలు :బంద్‌ను జయప్రదం చేయాలని మండల కేంద్రంలోని వారపు సంతలో గిరిజన సంఘం, సిపిఎం, గిరిజన వినియోగ దారుల సంఘం నేతలు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు, వైసిపి మండల అధ్యక్షులు మజ్జి చంద్రబాబు, సందడి కొండబాబు, పీసా కమిటీ రోగులుపేట కార్యదర్శి జంబు దేవరాజు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు బొండా గంగాధరం, బీఎస్పీ మండల నాయకులు లోచలి భగీరధి మోహన్, గలగండ సర్పంచ్ పూజారి లోహిదాసు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో మానవహారం

డుంబ్రిగుడ: 1/70 భూ బదలాయింపు చట్టాన్ని రద్దు చేయాలని చూస్తే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరిస్తూ సోమవారం మండలకేంద్రంలో గిరిజన సంఘం,సిపిఎం నాయకులు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు.స్థానిక జూనియర్ కళాశాల నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు మాట్లాడుతూ, ఆదివాసులకు కల్పించిన రాజ్యాంగ చట్టాలను, హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ ు పాల్గొన్నారు.

చింతపల్లి: మన్యం బంద్ కు జాతీయ రహదారి కార్మికులు సహకరించాలని అంతర్ల పీసా కమిటీ ఉపాధ్యక్ష కార్యదర్శులు గబులంగి నాగేశ్వరరావు, కవడం శివ సంతోష్ కోరారు. గిరిజన హక్కులు చట్టాలను ప్రభుత్వాలు కాలరాస్తే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి గుత్తేదారుడు తిలక్‌ను కలిసి మన్యం బంద్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కవడం ఈశ్వరరావు, అరడ ధర్మరాయుడు పాల్గొన్నారు.

బంద్ జయప్రదానికై చింతపల్లిలో పైకి ర్యాలీ చేపడుతున్న అఖిలపక్ష రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు.

చింతపల్లి :బంద్ జయప్రదం చేయాలని చింతపల్లిలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు స్థానిక డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీ చేపట్టారు. బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, చింతపల్లి జడ్పిటిసి పోతురాజు బాలయ్య, సిపిఎం మండల కార్యదర్శి. పాంగి ధనుంజయ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి. సాగిన చిరంజీవి, సిపిఐ మండల నాయకులు ఎర్రబొమ్మల ఎంపిటిసి. సెగ్గే సత్తిబాబు పాల్గొన్నారు.

విఆర్.పురం :ఏపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు నిరసనగా ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు ఈ నెల 11, 12 తేదీలలో జరిగే 48 గంటల ఏజెన్సీ మన్యం బంద్ విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు సోమవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, పోడియం. శ్రీరామ్మూర్తి, వేటగాని సూరి, సారా పాండురాజు, పూనెం కిరణ్, వైసిపి కార్యకర్తలు పిట్ట రామారావు, చిక్కాల బాలు, పోడియం సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. మండల కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, పాఠశాలలు, బ్యాంకుల అధికారుల, సిబ్బంది, దుకాణాలదారులకు కరపత్రాలు పంపిణీ చేసి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కాకా అర్జున్‌దొర, జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, జి.హరి, ఇరపా సత్యం, సోందే రామారావు, సవలం రాము, పొడియం రత్తమ్మ, సీఐటీయూ నాయకులు తోట శ్రీను, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు భీష్మ, సురేష్, ఆసు ప్రసాద్, కాకా వీరయ్య, సోయం పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురంలో ప్రచారం చేపడుతున్న నేతలు

అరకులో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సురేంద్ర

కొయ్యూరు : 48 గంటల ఏజెన్సీ మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎస్ సూరిబాబు, జేఏసీ నాయకులు అధికారులకు, హోటళ్ల నిర్వాహకులకు కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. గిరిజన సంఘం, అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీలేరు : మన్యం బందును జయప్రదం చేయాలని జికె.వీధి మండలం మంగళపాలెం క్లస్టర్ పీసా ఉపాధ్యక్షులు మచ్చల బాబురావు పిలుపునిచ్చారు. బంద్ గోడ పత్రికలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/70 చట్టం రక్షణకే ఈ బంద్ జరుగుతుందని చెప్పారు. మన్యం బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు, మేధావులు హాజకరించాలని కోరాఉ. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఈనెల 11 12 తేదీల్లో ఆదివాసీ సంఘం తలపెట్టిన మన్యం బందుకు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ఇచ్చినట్లు ఆయా సంఘాల నాయకులు సోమవారం తెలిపారు. రాజవొమ్మంగిలో యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు కారం రాంబాబు సమక్షంలో సోమవారం అత్యవసర కార్యవర్గ సమావేశం జరిగింది. పీవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, కానెం శ్రీను, సిఐటియు జిల్లా నాయకులు రామరాజు, యుటిఎఫ్ నాయకులు కానెం శ్రీను, కోడూరి లోవరాజు, ఆవూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం మద్దతు

ఎంవిపి.కాలనీ : మంగళ, బుధవారాల్లో జరిగే మన్యం బంద్‌కు విశాఖపట్నం జిల్లా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఎంవిపి.కాలనీలోని గిరిజన్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు దారుణమైనవని పేర్కొంది. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్, గౌరవ అధ్యక్షులు భాక సత్యారావు, సలహాదారులు కిముడు రామారావు, కొక్కుల రామారావు, పిసిహెచ్.రామానాయుడు, బొండా తౌడన్న, ఒలేసి రామలింగం, సభ్యులు జన్ని రామన్న, దేపూరి పూజ్య శేఖర్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జివిఆర్.మూర్తి, అధ్యక్షులు కిముడు చిన్నంనాయుడు పాల్గొన్నారు.

బందుకు పోలీస్ శాఖ సహకరించాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:1/70 చట్టం పరిరక్షించాలని ఈ నెల 11,12 తేదీల్లో 48 గంటలు చేపడుతున్న మన్యం బంద్ కు పోలీస్ శాఖ సహకరించాలని ఆదివాసి గిరిజన సంఘం లేక ఆధ్వర్యాన వాట్సప్ ద్వారా లేఖ పంపించినట్లు ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కిల్లో సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ హక్కుల కోసం శాంతియుతంగా బంద్ నిర్వహిస్తున్నామని, గతంలో అనేక బంద్‌లను శాంతి యుతంగా నిర్వహించామన్నారు. ఎన్నికల కోడ్ చట్టాలను, గౌరవిస్తూ శాంతి భద్రతలను విఘాతం కలిగించకుండా ఈనెల 11, 12 తేదీల్లో ఆదివాసీ ప్రజాసంఘాలు నిర్వహిస్తున్న 48 గంటల బంద్ కు పోలీసు శాఖ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బంద్‌పై కలెక్టర్‌కు విజ్ఞప్తి

పాడేరు : 1/70పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని కోరుతూ ఈనెల 11,12 తేదీల్లో చేపట్టే మన్యం బంద్‌కు సహకారం అందించాలని ఆదివాసి అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర మన్యం బంద్‌ను భగ్నం చేసేందుకు ఎన్నికల కమిషన్‌ను అడ్డుగా పెట్టుకొని పోలీస్ లతో నోటీస్‌లు ఇస్తున్నారని తెలిపారు. పోలీసులతో మాట్లాడి శాంతియుతంగా మన్యం బంద్ విజయవంతం చేసుకోవాలని, పోలీస్ లకు సహకారం అందించాలని కలెక్టర్ సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం, అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు పి.అప్పలనరస, సమర్ధి మాణిక్యం, రాధాకృష్ణ, రాజబాబు, వంతాల నాగేశ్వరావు, కొండపల్లి కాంతారావు, పి.జీవన్ కృష్ణ, సుబ్రమణ్యం, ఎల్.సుందర్రావు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 10 మంది నామపత్రాల దాఖలు
నేడు పరిశీలన - 13 వరకూ ఉపసంహరణ గడువు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల సమర్పణ గడువు సోమవారంతో ముగిసింది. చివరిరోజైన సోమవారం పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావులు నామినేషన్లు వేశారు. దీంతో మొత్తం నామినేషన్లు వేసిన వారి సంఖ్య పదికి చేరింది. నామినేషన్లు సమర్పించిన వారిలో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ఎపిటిఎఫ్ బలపరిచిన పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు బలపరిచిన గాదె శ్రీనివాసులు నాయుడుల తో పాటు కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, పోతల దుర్గారావు, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు ఉన్నారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈ నెల 13తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఆరోజు నాటికి పోటీలో ఎంతమంది ఉన్నారనేది స్పష్టంకానుంది. ఈ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికల అధికారిగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వ్యవహరిస్తున్నారు.

నామినేషన్ వేస్తున్న శివప్రసాద్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22493 మంది
పోలింగ్ స్టేషన్లు 123

ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు ఉత్తరాంధ్రలోని 5 జిల్లాలలో కలిపి మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం వరకు ఓటర్లు నమోదు కావడానికి అవకాశం ఇవ్వడంతో 1300 మంది ఓటు కోసం కొత్తగా దరఖాస్తులు సమర్పించారు. వాటన్నింటినీ పరిశీలించి 938 మందిని అర్హులుగా నిర్ణయించారు. దీంతో ప్రారంభంలో 21,555 మందిగా ఉన్న ఓటర్ల సంఖ్య 22,493కి చేరింది. మొత్తం ఓటర్లలో పురుషులు 13, 508 మంది కాగా మహిళా ఓటర్లు 8985 మంది ఉన్నారు.

జిల్లాల వారీగా చూస్తే..

శ్రీకాకుళం జిల్లాలో 5035 మంది, విజయనగరంలో 5223 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 1488 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1488 మంది, విశాఖపట్నం జిల్లాలో 5529 మంది, అనకాపల్లి జిల్లాలో 2825 మంది ఉన్నారు. ఐదు జిల్లాల్లో కలిపి 123 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో 31, విజయనగరం జిల్లాలో 29, పార్వతీపురం మన్యం జిల్లాలో 15, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విశాఖపట్నం జిల్లాలో 13, అనకాపల్లి జిల్లాలో 24 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి గోదావరి జిల్లాల
పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి 49 మంది నామినేషన్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి :ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల పర్వం సోమవారంతో ముగిసింది. జనవరి 29న ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. పదోతేదీ సోమవారం సాయంత్రం నామినేషన్ల స్వీకరణ ముగిసింది. ఎంఎల్‌సి ఎన్నికల రిట్నరింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నామినేషన్లను స్వీకరించారు. నామినేషన్ల గడువు ముగిసేసరికి మొత్తం 49 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కొంతమంది అభ్యర్థులు రెండేసి చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఏడో తేదీ శుక్రవారం, చివరిరోజు సోమవారం అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 440 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. అవసరాన్ని బట్టి పోలింగ్ కేంద్రాల పెంపునకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

'ప్రజా జీవనానికి అంతరాయం కలిగిస్తే చర్యలు'

ప్రజాశక్తి-రంపచోడవరం

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రంపచోడవరం సబ్ డివిజన్ పరిధిలో ప్రజా జీవనానికి అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ముందస్తు అనుపతి లేకుండా సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించుట నిషేదించడమైనదని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేసినా, దుకాణాలను, వ్యాపార సంస్థలను బలవంతంగా మూసి వేయించినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, బస్సులు నిలిపివేసినా, అత్యవసర సర్వీసులకు, ప్రజా జీవనానికి అంతరాయం కలిగించినా పోలీసులు చట్టరీత్యా తీసుకుని చర్యలకు బాధ్యులు అవుతారని పేర్కొన్నారు. ప్రజలందరూ అర్థం చేసుకొని పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

గోడకూలి బాలుడు మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కొమ్మిక పంచాయతీ, కొత్త బొర్రంపేట గ్రామంలో గోడ కూలి సిమెంట్ ఇటుక తలపై పడడంతో బాలుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాలుడి చిన్నాన్న అర్జున్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం... కొత్త బొర్రంపేట గ్రామంలో మర్రి రాజుబాబు కుమారుడు మర్రి భీమేశ్వరరావు (5)తో పాటు మరో ఇద్దరు పిల్లలు ఆదివారం ఆడుకుంటూ ఉండగా గోడ కూలి, సిమెంట్ ఇటుక భీమేశ్వరరావు తలపై పడింది. భీమేశ్వరరావు మృతి చెందాడు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కళ్ళ ముందు ఆటపాటలతో అలరించే బాలుడు ఒక్కసారిగా ఇలా ప్రమాదానికి గురై మృత్యువాత పడడంపై కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

భీమేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

13 నుంచి పీసా చట్టంపై శిక్షణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పీసా చట్టంపై ఈ నెల 13 నుండి శిక్షణా తరగతులు రాజవొమ్మంగిలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీసా కమిటీ వైస్ చైర్మన్, కార్యదర్శి, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపిపి, జడ్పిటిసి, ఎంపీటీసీలు, సచివాలయ, వెలుగు సిబ్బందికి పీసా చట్టంపై అవగాహన తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ శిక్షణకు సంబంధిత ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు

దేశీయ పసుపు సాగును ప్రోత్సహిస్తాం

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు

గిరిజన రైతులు పండిస్తున్న సాంప్రదాయ దేశీయ పసుపు సాగును ప్రోత్సహిస్తామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. డిజిటల్ గ్రీన్ సంస్థ, మిలిండా గేట్స్ ఫౌండేషన్ సౌజన్యంతో సోమవారం స్థానిక కళ్యాణ మండపంలో నిర్వహించిన పసుపు కొనుగోలు దారులు, విక్రయదారులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక రోజు వర్కుషాపుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పసుపు సాగులో అల్లూరి సీతారామరాజు జిల్లా 60 శాతం వాటాను ఆక్రమించిందన్నారు. గిరిజన రైతులు సేంద్రీయ పసుపును సాగు చేస్తున్నారని చెప్పారు. పసుపు సాగులో గిరిజన రైతులకు మెళకువలపై అవగాహన కల్పిస్తే మంచి దిగుబడులు సాధిస్తారని పేర్కొన్నారు.కర్కుమిన్ ఉన్న పసుపు పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పసుపు కొనుగోలుపై రైతులతో ఒప్పందాలు చేసుకోవాలని కొనుగోలుదారులకు సూచించారు. రైతులకు మంచి గిట్టుబాటు ధరను అందించాలన్నారు. గిరిజన రైతులు సంఘాలుగా ఏర్పడి రైతు ఉత్పతిదారుల సంఘాల్లో చేరాలని స్పష్టం చేసారు. మార్చి 15 వ తేదీ నుండి జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులు, రైతుల పెట్టుబడులు, నికర ఆదాయంపై సమగ్రమైన సర్వే నిర్వహిస్తామని చెప్పారు. ఉద్యానవన అధికారులు పసుపు సాగుపై గిరిజన రైతులకు తగిన సలహాలు సూచనలు, సస్యరక్షణపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఉద్యాన వన శాఖ సంయుక్త సంచాలకులు నెలకు ఒక సారి జిల్లాలో పర్యటించాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ పసుపు పంటలో గిరిజన రైతులు సాగు చేస్తున్న పసుపుమేటని పేర్కొన్నారు. పసుపు పంటను దళారులకు విక్రయించకుండా నేరుగా వాణిజ్య సంస్థలకు విక్రయిస్తే గిట్టుబాటు ధర పొందవచ్చున్నారు. కర్కుమిన్ ఉన్న పసుపును సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. స్పైసెస్ బోర్డు రాయితీపై గిరిజన రైతులకు పసుపు ఉడకబెట్టే యంత్రాలను సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. పసుపు ఉత్పత్తిలో తగిన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే వాణిజ్య సంస్థలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తాయని రైతులకు గిట్టుబాటు ధర అందుతుందన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పర్కుషాపులో ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు ఎం.జి. ముని రెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా సెరీ కల్చర్ అధికారి అప్పారావు, స్పైసెస్ బోర్డు సహాయ సంచాలకులు వి.విజీషా, ఉద్యాన శాస్త్ర వేత్త సి. హెచ్.బిందు, ఇమిర్చా ప్రాజెక్టు మేనేజర్ జ్యోతి, స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర అధికారి బి.కల్యాణి, వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-చింతూరు : జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా చింతూరులో సోమవారం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ చెల్లారావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎర్రంపేటలోని ఎంవిఐ కార్యాలయం నుండి చింతూరు సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో టాటా మ్యాజిక్‌లు, ఆటోల ఓనర్‌లు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ చెల్లారావు మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, నిర్దేశించిన స్పీడ్‌లోనే వాహనాలు నడపాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నడిపితే భారీ జరిమానాలు అధికారులు విధిస్తారని పేర్కొన్నారు. పరిమితి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించే అలవాటు మానుకోవాలని సూచించారు. లారీలలో ఓవర్ లోడ్ వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్, సభ్యులు, మ్యాజిక్ ఓనర్లు, ఆటో ఓనర్లు, కాలేజీ విద్యార్థులు, భారీ ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ఉమాదేవి

ఫార్మర్ రిజిస్ట్రీతో నకిలీ రైతులకు అడ్డుకట్ట

ప్రజాశక్తి-కొయ్యూరు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కొరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నకిలీ రైతులపాలు కాకుండా అడ్డుకట్ట వేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ పథకాన్ని ప్రవేశపెట్టిందని మండల వ్యవసాయాధికారి ఉమాదేవి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు రైతులకు సక్రమంగా అందకపోగా నకిలీలపరం అవుతున్నాయని, ఆ అక్రమాలకు అడ్డుకట్టు వేసేందుకు, అర్హులకు లబ్ధి చేకూరేందుకు ఈ ఫార్మర్ రిజిస్ట్రీని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతుకు ఒక విశిష్ట సంఖ్య నమోదు చేసి, నిర్ధిష్ట సంఖ్య ఇవ్వాలని, అందులో అన్నదాతల వివరాలను నమోదు చేసే ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. మండలంలో శుక్రవారం నుంచి ఈ ప్రక్రియ ప్రతి రైతు సేవ కేంద్రంలో ప్రారంభించామన్నారు. నిర్దేశించిన ఇంటర్నెట్ పోర్టల్‌లో అన్నదాతల ఆధార్ నెంబర్‌ను నమోదు చేసి, చరవాణికి అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో ఉపయోగించి ఈ యొక్క విశిష్ట సంఖ్యను కేటాయిస్తారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, పరికరాలు, రాయితీలు పొందడానికి అధికారకంగా ఈ నెంబరు ఉపయోగపడుతుందన్నారు. ఈ విశిష్ట సంఖ్య ద్వారా అవసరమైన సమయాల్లో అర్హులైన రైతులను గుర్తించడం జరుగుతుందన్నారు. పంటల బీమా, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదలైన వాటికి, పంట రుణాలు పొందటానికి ఈ విశిష్ట సంఖ్య తప్పనిసరి అని పేర్కొన్నారు. పట్టా భూమి కలిగి ఉన్న ప్రతి రైతు తమ యొక్క ఆధార్ కార్డు, మొబైల్ నెంబరు తీసుకొని రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించిన యెడల రైతు సమక్షంలోనే కంప్యూటర్లో డేటాను వేసి మొబైల్‌కి వచ్చిన ఓటీపీని వేసిన వెంటనే నమోదు ప్రక్రియ పూర్తయి ప్రత్యేక సంఖ్య వస్తుందని, మండలంలో రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమాదేవి కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ అభిషేక్ గౌడ్

మాట్లాడుతున్న ఇన్‌చార్జి పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆశ్రమ పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జెసి, ఐటిడిఎ ఇన్చార్జి పిఒ ఎంజె అభిషేక్ గౌడ్ ఆదేశించారు. సోమవారం గుత్తులపుట్టు టిడబ్ల్యు బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. వంటగది, స్టోరూంలను పరిశీలించారు. వీటిని పరిశుభ్రంగా ఉంచాలని పలు సూచనలు చేసారు. అనంతరం విద్యార్థునిలతో నులిపురుగుల మందులను మింగించారు. జాతీయ నులిపురుగల దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుగుకోవాలని సూచించారు. పరిశుభ్రంగా లేకపోతే సూక్ష్మ క్రిమలు చేరి వ్యాదులు దరి చేరతాయన్నారు. 6, 10వ తరగతులను సందర్శించారు. హిందీ పాఠ్యపుస్తకాలలోని ప్రశ్నలను వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. పది, ఇంటర్ తరువాత బాగా చదువుకుని డాక్టర్లుగా, ఇంజనీర్లగా ఎదగాలని సూచించారు. టిడబ్ల్యు డిడి ఎల్.రజని పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

-పాడేరు డిఎస్‌పి షేక్ షాహాబాజ్ అహ్మద్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సబ్ డివిజన్ పరిధిలో ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిషేధించడమైనదని పాడేరు డిఎస్ పి షేక్ షాహాబాజ్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయడం, దుకాణాలను, వ్యాపార సంస్థలను బలవంతంగా మూసి వేయించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, బస్సులు ఆపేయడంతో పాటు అత్యవసర సర్వీసులకు, ప్రజా జీవనానికి అంతరాయం కలిగించడం వంటి చర్యలకు పాల్పడడం చట్టరీత్య నేరమని పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు

ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇంద్ర ప్రియాంక

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇంద్ర ప్రియాంక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత ఐదేళ్లుగా జనరల్ వైద్యాధికారిగా ఆమె విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైద్యాధికారులు రోగులకు అందుబాటులో ఉండి, వైద్య సేవలు అందించాలని ఆమె సూచించారు. ఇంతవరకు సూపరిండెంట్‌గా విధులు నిర్వర్తించిన ప్రభావతి చిన్నపిల్లల వైద్య నిపుణురాలుగా సేవలందిస్తారని ఆమె తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి తరలివస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రోగులకు ఏ అవసరం తలెత్తిన నేరుగా తనకు సంప్రదించాలని ఆమె సూచించారు.

డాక్టర్ ఇంద్ర ప్రియాంక

నేడు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి-పాడేరు : ఈనెల 11వ తేదీన మన్యం బంద్ కారణంగా పాడేరు డివిజన్లో నిర్వహించవలసిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను వాయిదా వేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తిరిగి ప్రాక్టికల్స్ ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు మార్పును గమనించాలని కోరారు.

నులి పురుగుల నివారణతో పిల్లలకు ఆరోగ్యం

● డీవార్మింగ్ డేలో అల్బెండజోల్ మాత్రలు వేయించాలి : కలెక్టర్ దినేష్‌కుమార్

హుకుంపేటలో విద్యార్థికి మాత్రలను వేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-హుకుంపేట: ఆశ్రమ పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేయించాలని కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక కె.జి.బి.వి బాలికల పాఠశాల విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాతూ, 2 సంవత్సరాల నుంచి 19 ఏళ్ల వయసు లోపు ఉన్న విద్యార్థులకు ఒక అల్బెండజోల్ మాత్ర వేయాలని చెప్పారు. ఈ మాత్రలతో ఏ విధమైన ఇబ్బందులు ఉండవన్నారు. విద్యార్థులు ఎవరైనా స్కూల్‌కి రాకపోతే వారికి మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. జిల్లాలో 3 లక్షల 35 వేల మంది పిల్లలు ఉన్నట్టు చెప్పారు. పిల్లలందరూ అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. నులిపురుగులతో రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య, శాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా, ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రతాప్, డిప్యూటీ డైరెక్టర్ గిరిజన సంక్షేమ శాఖ రజని, . వైద్యాధికారులు, ప్రోగ్రాం మేనేజర్ కిషోర్ కుమార్, లక్ష్మయ్య, విద్యా శాఖ అధికారి చెల్లయ్య, ఈశ్వర్ రావు, హెల్త్ సూపర్ వైజర్ సాంబ శివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహులు పాల్గొన్నారు.

చింతపల్లి: బాల బాలికలకు నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. మండల విద్యాశాఖ అధికారి పనసల బాల వీర వెంకట వరప్రసాద్ తో కలిసి స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాత్రలు వేసుకుంటే బాలబాలికలకు వ్యాధుల నుంచి రక్షించడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయుడు ఊలం వీరభద్రం పడాల్, ఏఎన్ఎం లోసరి లక్ష్మమ్మ, హెల్త్ అసిస్టెంట్ కొంత సత్యరావు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి రాంబాబు ఆధ్వర్యాన సోమవారం నులి పురుగుల మందులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈ శౌరి, హెల్త్ అసిస్టెంట్ స్వామి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : నులిపురుగుల నివారణతో ఆరోగ్యం చేకూరుతుందని బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమేష్‌బాబు అన్నారు. మండలంలోని బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేయించారు. విద్యార్థులకు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శేషారత్నం, రమ్య, నూకరత్నం, రాంబాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల నివారణ మాత్ర వేసుకోవాలని డౌనూరు వైద్యాధికారి డాక్టర్ లలిత అన్నారు. మండలంలోని డౌనూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డాక్టర్ లలిత మాట్లాడుతూ నులిపురుగుల నివారణ వల్ల రక్తహీనత తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ప్రభదాసు, హెచ్‌వి జె రాణి, పిడి పోతురాజు, హెచ్‌డబ్ల్యుఒ హరిదేవ్, పాఠశాల ఉపాధ్యాయులు జలుమూరి గిరిబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి : నులి పురుగులు నివారణ ద్వారా వ్యక్తిగతమైన ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో 5,600 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వి.ముత్యాలరావు, ప్రధానోపాధ్యాయులు బిఎస్ కుమార్, ఏఎన్ఎం జీ.వాహిని, ఆశ కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.

కొయ్యూరు, మారేడుమిల్లి, రాజవొమ్మంగిలో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న వైద్యులు, సిబ్బంది, ఉపాధ్యాయులు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదం

- కాంట్రాక్ట్ కార్మికునికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జరిగిన అగ్ని ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సిఒ సిపిపి పోస్బెల్ కంపెనీ బ్యాటరీ-2లో పనిచేస్తుండగా నాగ శ్రీనివాసరావు అనే కాంట్రాక్టు కార్మికుడు ఛార్జింగ్ లీడ్‌పై కాలు మోపడంతో లీడ్ ఒవేన్ నుంచి భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కార్మికుడికి శరీరం పూర్తిగా కాలిపోయింది. అయితే ఈ ప్రమాదానికి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యమే కారణమని కార్మికులు ఆరోపిస్తున్నారు. బ్యాటరీలోని యచరింగ్ (ఎక్స్పాండ్) మెయింటనెన్స్ లేకపోవడం వల్లనే కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. . స్థానికులు గుర్తించి బాధితుడిని ఆసుపత్రికి తరలించారు.. స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల్లో కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరిగినా, వారికి న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాడుదామన్నారు.

గాయపడిన శ్రీనివాసరావు

అపోలో వైద్యునికి ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - ఆరిలోవ : సీనియర్ ఆర్థో పెడిక్ కన్సల్టెంట్, ప్రొఫెసర్ అండ్ హెచ్ఒడి అపోలో వైద్యులు డాక్టర్ అబ్దుల్ ఢీ ఖాన్‌కు సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. విశాఖ నగరంలో ఇటీవల నిర్వహించిన ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఒస్సప్) వార్షిక సదస్సులో ఈ అవార్డును. కోయంబత్తూర గంగా ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రాజశేఖర్ నుంచి అందుకున్నారు. ఈ ఏడాది సదస్సులో ఉత్తమ ఒరిజనల్ రీసెర్చ్ పేపర్‌ను సమర్పించినందుకు ఈ అవార్డు లభించింది. డాక్టర్ అబ్దుల్ ఖాన్ ఆంధ్రా మెడికల్ కాలెజీ నుంచి ఎంబిబిఎస్ పూర్తి చేసారు. అనంతరం యు.కెలో గల లివర్ పూల్‌లో ఉన్నత ఆర్థో పెడిక్ శిక్షణ , మరిన్ని డిగ్రీలు పొందారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో 80కి పైగా మౌఖిక, ఇ-పోస్టర్ ప్రదర్శనలను ఇచ్చారు.డాక్టర్ అబ్దుల్ డి ఖాన్‌ను సహచర వైద్యులు, యాజమాన్యం అభినందించింది.

డాక్టర్ అబ్దుల్ డి ఖాన్

నేడు ఇపిఎఫ్ పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి -ములగాడ : సమస్యల పరిష్కారానికి ఈనెల 11న జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద ఇపిఎఫ్ పెన్షనర్లు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సిహెచ్ తమ్మారావు కోరారు. సోమవారం మల్కాపురం సిఐటియు కార్యాలయంలో పారిశ్రామిక ప్రాంత పెన్షనర్ల ప్రాంతీయ సమావేశంలో పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె హుస్సేన్, కె.నూకరాజు, ఎం.సూర్యారావు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ అమలు చేయడం సంతోషకరమన్నారు. మిగతా ప్రభుత్వరంగ సంస్థల పెన్షనర్లకు కుంటిసాకులు చెప్పకుండా హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని కోరారు. పిప్‌యార్డు, కోరమండల్, హెచ్‌పిసిఎల్ వంటి సంస్థల ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ వచ్చే అవకాశం లేదని పిఎఫ్ కమిషనర్ చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం చేసామన్నారు. కేంద్రబడ్జెట్‌లో పెన్షన్ పెంపుపై ఎటువంటి ప్రకటన లేకపోవడం బాధాకరమని,పెన్షనర్లు నిరుత్సాహ పడకుండా పోరాట కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న నూకరాజు

విశాఖ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనంపై..

వాడపాలెం హైస్కూల్ విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మధ్యాహ్న భోజనం బాగుండటం లేదంటూ రుషికొండ వాడపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వారం రోజులుగా తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా భోజనం ఉండటం లేదని తెలిపారు. విద్యార్థులు కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారని తెలియడంతో డిప్యూటీ డిఇఒ ఎ.సోమేశ్వరరావు హుటాహుటిన అక్కడకు చేరుకొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన విరమించాలని, రుచికరమైన భోజనం పెట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో విద్యార్థులు శాంతించారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) డైరీని సోమవారం విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ విశాఖ అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాదీ రాష్ట్ర కార్యవర్గం పూర్తిస్థాయి సమాచారంతో డైరీని ముందుకు తెచ్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే జర్నలిస్టుల సమస్యల విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను కలుస్తామన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎన్.రామకృష్ణ, పిల్లా నగేష్ బాబు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ కార్యదర్శి కెవి.శర్మ, జాయింట్ సెక్రటరీలు రవిశంకర్, రాజశేఖర్, బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ కార్యదర్శి కె.మధన్, సభ్యులు శ్రీలత, రేణుక పట్నాయక్, సతీష్‌బాబు పాల్గొన్నారు.

క్రికెట్‌లో విశాఖకు గుర్తింపు తేవాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్రికెట్ క్రీడాకారులు విశాఖకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని మిలీనియం స్టార్, ప్రముఖ సంఘ సేవకులు కంచర్ల ఉపేంద్రబాబు పేర్కొన్నారు. యువత క్రికెట్‌లో రాణించడం ద్వారా ఆరోగ్యంతోపాటు పాటు మంచి శారీరక దృఢత్వం కూడా చేకూరుతుందన్నారు. ఐదు రోజులుగా ఆంధ్ర యూనివర్శిటీ ఫుట్ బాల్ గ్రౌండ్ వేదికగా ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన క్రిష్ణా కాలేజ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు పోటీల్లో ఉపేంద్రబాబు పాల్గొని విజేతలకు ఉపకార్ ట్రస్ట్ నుంచి రూ.80 వేల నగదును బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గంలో పయనించకుండా ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

4, 5 తేదీల్లో

కృత్రిమ చేతుల అందజేత శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చేతులు లేని నిరుపేదలకు ఉచితంగా ప్రోస్థటిక్ (కృత్రిమ) చేతులను అందించేందుకు మార్చి 4, 5 తేదీలలో విశాఖలో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శిబిరం కో-ఆర్డినేటర్ సి.బాలసతీష్ ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. శారీరక వైకల్యంతో బాధపడే వారు సామాజిక జీవనానికి వెనుకబడకుండా సాధారణ జీవితాన్ని గడపేందుకు సహాయపడటమే తమ లక్ష్యమన్నారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ప్రోస్థటిక్ ఆర్మ్‌లు పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. అందుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం సెంట్రల్ అధ్యక్షురాలు ఎస్.లావణ్య పాల్గొన్నారు.

ప్రాణదాత యువంత్

అరుదైన వ్యాధితో బ్రెయిన్ డెడ్
అవయవదానంతో ముగ్గురికి నూతన జీవితం

ప్రజాశక్తి - ఆరిలోవ : అరుదైన వ్యాధి సోకడంతో బ్రెయిన్ డెడ్ అయిన ఆ బాలుడు అవయవదానం చేసి ముగ్గురికి నూతన జీవితాలను ప్రసాదించాడు. పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి ప్రాంతం కాపుగోదయవలసకు చెందిన వాతాడ చిరంజీవులు దంపతులకు ఇద్దరు కుమారులు. గత నెల 29న ఆరో తరగతి చదువుతున్న చిన్న కుమారుడు యువంత్ జన్మదిన వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో గొంతు నొప్పి రావడంతో స్థానిక వైద్యులను సంప్రదించారు. మొదట సాధారణ సమస్యగా పరిగణించారు. ఎంతకీ నొప్పి నియంత్రణ కాకపోవడంతో శ్రీకాకుళంలోని ఆసుపత్రికి తరలించాలని ఆ వైద్యుడు సూచించారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆసుపత్రిని సంప్రదించగా నొప్పి నియంత్రణ కాకపోగా మరింతగా ఆరోగ్యం క్షీణించింది. దీంతో విశాఖపట్నంలోని కెజిహెచ్‌కు తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షలు జరిపి అరుదైన గులెన్ బ్యారీ సిండ్రోమ్ వ్యాధిగా గుర్తించారు. కొన్ని రోజులు చికిత్స అందించి మందులు రాసి ఇంటికి పంపించారు. అయితే మరలా ఆరోగ్య పరిస్థితి క్షీణించటంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి యువంత్‌ను తల్లిదండ్రులు తరలించారు. అక్కడి వైద్యులు తీవ్రంగా శ్రమించినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి పురోగతీ కనిపించలేదు. దీంతో వైద్య బృందం యువంత్ బ్రెయిన్ డెడ్ అయినట్లుగా ప్రకటించారు. అదే విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు అవయవదానం చేసేందుకు అంగీకారం తెలపడంతో ఆ సమాచారాన్ని జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబుకు తెలియజేశారు.

ఆయన ఆదేశాల మేరకు బాలుని శరీరంలో పనిచేస్తున్న రెండు కిడ్నీలు, లివర్‌ను సేకరించారు. వాటిని జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం సీనియార్టీ లిస్టు ఆధారంగా ముగ్గురు వ్యక్తులకు కేటాయించారు. ఒక కిడ్నీని శ్రీకాకుళం ఆసుపత్రికి, మరొక కిడ్నీని, లివర్‌ను విశాఖపట్నంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా అవయవదానానికి ప్రోత్సహించిన వైద్య బృందానికి, అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చిన బాలుని తల్లిదండ్రులకు డాక్టర్ రాంబాబు అభినందనలు తెలిపారు.

యువంత్ (ఫైల్ ఫొటో)

టిడ్కో ఇళ్ల సముదాయాల్లో..

మందిరాల బదులు కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలి

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడ్కో ఇళ్ల సముదాయాల్లో మందిరాలకు బదులు అక్కడి లబ్ధిదారుల ప్రయోజనం కోసం కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేయడం మంచిదని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. దానిలోని వివరాలను సోమవారం వెల్లడించారు. 2014-19లో టిడిపి హయాంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పేదల కోసం టిడ్కో సంస్థ ద్వారా నివాసయోగ్యమైన ఇళ్ల సముదాయాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆ పథకం కింద వేలాది మంది పేద కుటుంబాలకు లాభం కలిగిందన్నారు. అయితే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి టిడ్కో ఇళ్ల సముదాయాల్లో రామాలయాల నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నట్టు తాజాగా ఓ ప్రకటన చేశారన్నారు. అలా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుమతి ఉందో, లేదో తెలియదన్నారు. ఈ సందర్భంగా ఇఎఎస్.శర్మ రాజ్యాంగంలోని 15, 25వ ఆర్టికల్స్ కింద ప్రజలకు మతస్వేచ్ఛ ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ఆ విషయం మీద సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ఎన్నో మార్లు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ భూముల మీద ఒక మతానికి సంబంధించిన మందిరాలను నిర్మించడం చట్టవిరుద్ధంగా పరిగణించబడుతుందన్నారు. తన ఉద్దేశంలో చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో ఇళ్ల సముదాయాల్లో మందిరాల బదులు అక్కడున్న లబ్ధిదారుల ప్రయోజనం కోసం కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తే ప్రజలు లాభపడతారన్నారు.

అటువంటి వాటిని నిర్మిస్తే వారిలో సమైక్యతను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి సమాచారాన్ని వారికి ఎప్పటికప్పుడు అందించే అవకాశం కలుగుతుందన్నారు. అక్కడ అవసరమైతే ప్రభుత్వ సంస్థలు ఆరోగ్య శిబిరాలు వంటివి ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. వాటిలోనే రీడింగ్ రూమ్స్ వంటి సౌకర్యాలు కల్పించవచ్చునన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రామాలయాల నిర్మాణం మీద దేవాదాయ శాఖ మంత్రి ప్రకటించిన నిర్ణయాన్ని పున్ణ పరిశీలించాలని కోరారు.

నిస్సాన్ సర్వీస్ వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ కార్ల షోరూం నిస్సాన్ సంస్థ రెండు కొత్త టచ్ పాయింట్‌లను, ఒక షోరూమ్‌ను, అత్యాధునిక సర్వీస్ వర్క్‌షాప్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేసింది. కొత్త ఆరెంజ్ నిస్సాన్ షోరూమ్ వర్క్‌షాప్‌ను సోమవారం తూర్పు నావల్ కమాండ్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రియర్ అడ్మిరల్ ఎం.మురళీ మోహన్ రాజు, సీనియర్ అధికారులు, నావల్ ప్రాజెక్ట్స్ మేనేజ్‌మెంట్ టీమ్ కమోడోర్ అమర్‌జీత్ సలుజా, రీజినల్ మేనేజర్ కెప్టెన్ ఎన్ఆర్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిస్సాన్ మోటర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ వత్స మాట్లాడుతూ నిస్సాన్ మోటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించిందన్నారు. విశాఖలోని షోరూమ్ 4,270 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందని తెలిపారు.

అభినందన కార్యక్రమంలో మాట్లాడుతున్న సతీష్ కుమార్

ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో..

సతీష్ కుమార్‌కు కాంస్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన 4వ ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నగరానికి చెందిన వాసుపల్లి సతీష్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించి సత్తా చాటాడు. ఈ మేరకు సోమవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో అభినందన కార్యక్రమం చేపట్టారు. ఫౌండేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ లీగ్ ప్రెసిడెంట్ టెంకి దుర్గ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం సాగింది. ఈ నెల 1 నుండి 5 వరకు జరిగిన ఛాంపియన్ షిప్‌లో 18 దేశాలు పోటీ పడగా ఎపి నుండి ప్రాతినిథ్యం వహించిన వాసుపల్లి సతీష్ కుమార్ సూపర్ హెవీ వెయిట్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించినట్టు దుర్గ తెలిపారు. కాంస్య పతకాన్ని సాధించిన సంతోష్ మాట్లాడుతూ ఈ విజయం సాధించేందుకు ఎంతో కృషి చేశానని, పతకం అందుకోవడం ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఏప్రిల్‌లో థాయ్‌లాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలలో ఇండియా తరపున తాను పాల్గొంటున్నానని, ఆ పోటీలలో బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ క్రీడా సంఘాల ప్రతినిధులు జివి.రామచంద్రరావు, ఆనంద్ బాలు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : 15 మందికి గాయాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : ప్రయాణికులతో వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో సుమారు 15 మంది గిరిజనులు గాయాల పాలైన సంఘటన ఆదివారం ముక్కుడుపల్లి, చౌడిపల్లి మధ్య చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని బూదరాళ్ల పంచాయతీ, ముక్కుడుపల్లి నుండి రాజేంద్రపాలెం వారపు సంతకు ఆదివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఆటోలో వస్తున్నారు. ముక్కుడుపల్లి, చౌడిపల్లి మధ్య గల సిమెంటు గొప్ప వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బోనంగి రేకమ్మ, కుర్తాడి రాజారావు, పాంగి నందిని, దార మనోజ్, కించే బాలమ్మ, పొంగి కామేష్, గెమ్మెలి రామారావు, పాలిక రాధ, గణేశుల పెద్దబ్బాయి, గెమ్మెలి శాంతి, గెమ్మెలి దేవి తదితర 15 మంది గాయపడ్డారు. వీరిలో కించే బాలమ్మ చేయి విరిగిపోయింది. వీరిని 108 వాహనంపై రాజేంద్రపాలెం పిహెచ్‌సికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం 11 మందిని మెరుగైన వైద్యం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంప ఎస్సై తెలిపారు.

సుజుకి యాక్సిస్ 125 మోడల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సుజుకి టూ వీలర్స్ అగ్రశ్రేణి డీలర్ పద్మజ సుజుకి సిరిపురంలోని షోరూం వద్ద సుజుకి యాక్సిస్ 125 సరికొత్త మోడల్‌ను సోమవారం ఆవిష్కరించారు. వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిషోర్, ఎమ్‌డి వరుణ్ దేవ్ కొత్త యాక్సిస్ స్కూటర్‌ను ఆవిష్కరించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ప్రభు కిషోర్ మాట్లాడుతూ సరికొత్త సుజుకి యాక్సిస్ గొప్ప పికప్, గొప్ప మైలేజ్, అత్యుత్తమ నాణ్యతతో లభిస్తుందన్నారు. ఎల్ఇడి డిఆర్ఎల్‌తో క్లాసిక్ అర్బన్ డిజైన్, హజార్డ్ లైట్, కొత్త ఎన్ఇడి టైల్ ల్యాంప్స్, స్మూత్ స్టార్ట్ కోసం వన్ వే క్లచ్, ఉత్తమ పికప్ కోసం 10.2 ఎన్ఎం 5000 ఆర్‌పిఎం టార్క్‌ను పొందుపరిచినట్టు తెలిపారు. మినిమల్ పవర్ లాస్, ఉత్తమ ఎక్సిలరేషన్, తక్కువ ఎమిషన్, ఎన్విరాన్మెంట్ ఫ్రెండ్లీతో పాటు 5.3 లీటర్ల పెట్రోల్ ట్యాంక్ కెపాసిటీ కలదని తెలిపారు. అంతేకాక అందులో పొందుపరిచిన సరికొత్త డిజిటల్ డిస్‌ప్లేలో సర్వీస్ రిమైండర్ అలర్ట్స్, వెదర్ ఆంబియంట్ అలర్ట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్స్యూరెన్స్, ఆర్సి, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి సేవ్ చేసుకునేందుకు డిజిటల్ వాలెట్ వంటివి ఉన్నాయన్నారు.